ఈవారం కథ

ముఖం

- కిరణ్మయి

అప్పటి వరకూ గదంతా పరచుకున్న చీకటితో మనసునీ, శరీరాన్ని చల్లబరచుకొని ఒక్కసారి మెల్లిగా లేచాను. బహుశ పన్నెండయ్యుంటుందేమో- అందరూ నిద్రని ఆహ్వానిస్తుంటే నేను మాత్రం గదిలో లైటువేసి, పక్కన పెట్టేసిన పుస్తకంలోంచి అక్షరాలు కూడబలుక్కుంటున్నట్టు చదవడం మొదలుపెట్టాను. అక్షరాలు కూడా మను షుల్లాగా ఒంటరిగా అయిపోతున్నాయి. అన్నీ సమిష్టిగా ఏ అర్థాన్నీ ఇవ్వట్లేదు సరికదా, ఒంటరిగా మాత్రం వ్యధా పూరితంగా గోచరిస్తున్నాయి.

అదేం విచిత్రమో! మధ్యాహ్నం అనగా మొదలు పెట్టిన కథ అది - చదవడం అసలు పూర్తికాదు. బలవంతంగా శ్రద్ధ, శక్తి కూడదీసుకుని చదువుదామన్నా పూర్తి కాలేదు. అమ్మమ్మ బలవంతం మీద నాలుగు మెతుకులు తిని చదవడం మొదలుపెడితే నిద్రవచ్చింది. లైటుఆర్పి వచ్చి చీకటిలో అలసటను తీర్చుకుంటూ, చల్లగా పడుకున్నాను.

ఏమిటోమిటో కలలు...!

ఎప్పుడో, ఎవరికో జరిగిన అన్యాయాలూ, ఆనవాళ్ళు లేని మృతదేహాలు, గుప్పెట్లో ప్రాణాలు పెట్టుకుని తిరుగుతున్నట్లుండే దూరదేశప్రాణులూ, ఇంట్లో రోజూ పెరిగే ఉద్రేకాలు-అన్నీ కలగాపులగంగా-

మూట కట్టుకుంటే, ఒకవైపు నుంచి జారి పోతున్నట్టు నిద్రలో కలలు - కొంచెం సేపటికి మెలకువ వచ్చేసింది

** ** **

చప్పుడు లేకుండా తలుపువేసి మేడ మీదకు ఒంటరిగా చేరుకున్నాను.

ఏం ప్రయోజనం లేదు. అక్కడకి మాత్రం ఈ ఆలోచనలు రావూ?

కానీ, ఇంకా నయం - ఆ లోపల మగ్గే కన్నా ఇలా చల్లగాలి పీల్చుకుంటేనే నయం, అనుకుంటూ దిండు దూరంగా మేడమ ధ్యలోకి గిరవాటువేసి చేతిలోని మంచి నీళ్ళ సీసా కిందపెడుతూ అప్పుడుచూశాను. మేడ మీంచి కింద రోడ్డుమీదకి.

ఆ ఆకారం స్పష్టంగా తెలియట్లేదు.కాదు.. కాదు.. మగవాడులా వున్నాడు. నేను అతనికి కనిపించను. చప్పనకూర్చున్నాను. అతను కనిపించే విధంగా వాలు చూసు కుని ఇంకా శ్రద్ధగా చూడడం మొదలు పెట్టాను. ఎవరై వుంటాడు? ఈ వేళప్పుడుఏం చేస్తున్నాడు?

ఎదురింటి వాళ్ళ మోరీ మీద దూరంగా కొసకంటూ కూర్చున్నాడు. దొంగై వుంటాడా? ఆయుధాలు వుండే వుంటాయి. అవును దొంగే- ఎందుకంటే పెద్ద ముసలి వాడిలా కనిపించట్లేదు. కుర్రవాళ్ళేగా అలా అవసరాలకంటూ దొంగతనాలుచేసేది!

లేకపోతే...

ఎవర్నైనా చంపి పారిపోవడంలో భాగంగా ఇక్కడ కూర్చున్నాడా? ఎవరైనా వచ్చి స్కూట ర్‌మీదో, జీప్ మీదో రయ్‌మని తీసుకు వెళ్ళిపోతారా?

వాడి ముఖం కనిపిస్తే బాగుండు.

దూరంగా స్కూటర్ చప్పుడు వినిపించింది. అది మా ఇంటి ముందుగా, కొంచెం పక్కగా వచ్చి ఆగింది. అతనుఆ స్కూటర్‌మీద వున్నవ్యక్తితో కొంచెం సేపు మాట్లాడి స్కూటర్ ఎక్కి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేంత వరకూ చూస్తుండిపోయాను.

ఇంతలో కింద తలుపు చప్పుడయ్యింది. దిండు, సీసా తీసుకుని పరుగుతో కిందకు వచ్చేశాను.

"ఏవిటీ ఎక్కడకు వెళ్ళావ్? మేడమీదకా? చెప్పా పెట్టకుండా అలా అర్థరాత్రి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోతే ఎలాగే? లేపి తలుపువేసుకోమని చెప్పడమో, బయట నుంచి తాళం వేయడమో చేస్తే భయం వుండదు. రోజులు అస్సలు బాగోలేదమ్మా...

అయినా నువ్వెందుకెళ్ళావ్, ఇంట్లో నిద్ర రాలే? ఒక్కదానివి వెళ్ళడం ఏమంత మంచిదమ్మా? అయినా ఒంటరి పక్షిలా అలా భయం లేకుండా ఎలా వెళ్ళగలరే బాబూ- పదేపద లోపలికి..." అంటూసాగిన అమ్మమ్మ మాటల్ని లెక్క చెయ్యకుండా నా గదిలోకి వెళ్ళి పక్క ఎక్కేశాను. అమ్మమ్మ 'అవతల'కి వెళ్ళివచ్చి తలుపు గడియని మరోసారి పరీక్ష చేసి పక్కన చేరింది. నేను, అమ్మమ్మ ఒకే గదిలో పడుకుంటాం. ఇంతకీ నేను చూపింది ఏమై వుంటుంది? ఏమీ తెలియకుండా ఎక్కువగా ఊహించేస్తున్నానేమోనని పీడించేస్తోంది. కానీ, మామూలుగా మసిలే మనిషైతే ఎందుకు అనుమానిస్తాను? తప్పకుండా ఏదో వెనక వుండి తీరాలి.

ఎంతో ద్రవిస్తున్న హృదయంతో పైకి వెళ్ళిన నేను నేరపరిశోధన స్పిరిట్‌తో కిందకి వచ్చాను.

ఇప్పుడంతా నిద్రలో ముసుగు వీరులు, కత్తులు, కటార్లు - నేను కన్నీరుకారుస్తూ లేను. నడుద్దామని,ఆ పరుగెడుతున్న వాళ్ళ వెంట పడదామంటే కాళ్ళుసహకరిస్తేనా?

నెమ్మది నెమ్మదిగా నా పరిశ్రమ నాకు తెలియకుండానే అంతమయ్యింది.

** ** **

పొద్దున్నే పేపర్ చదవడం ముగించి వంట ప్రారంభించాను. అమ్మమ్మకీ, నాకు మాత్రమే. మిగిలిన వాళ్ళందరూ చిన్న చిన్న ప్రయాణాల మీద అటూ ఇటూ వెళ్ళారు.

నేననుకున్నట్టు ఏమీ భయంకరమైన వార్త కనిపించలేదు పేపర్లో.

ఏదో ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతూ నా పని నిశ్శబ్దంగా చేసుకుపోతున్నాను. విపరీతంగా ఉక్కపోస్తోంది.

ఫాన్‌కింద నిలబడినా చాలట్లేదు.మెడంతా చెమటలు చిరాకుగా. గేటు చప్పుడయ్యింది.

మెడ తుడుచుకుంటూ తలుపు తీశాను. ఎవరో అపరిచిత వ్యక్తి.

"ఎవరు కావాలండీ? అనుమానంతోపాటుకాస్త మర్యాద. పులుముకుని అడిగాను.

"ఇక్కడ ఇళ్ళేమైనా అద్దెకిస్తారాండీ?"

"ఎవరే వచ్చింది?" లోపల్నుంచి అమ్మమ్మ కేక.

"ఏమీ ఖాళీలు లేవండీ. ఈ కాలనీలో మీకు ఎక్కువ దొరక్కపోవచ్చు. అద్దెలకి ఇచ్చే వాళ్ళు తక్కువ. ఆ పైవీధిలో అడగండి" అంటూ గేటువరకూవెళ్ళాను.

"థాంక్సండీ" అని అతను బయట స్కూటర్ మీద ఎదురు చూస్తున్న వ్యక్తి వెనక కూర్చుని వెళ్ళిపోయాడు.

"ఏవిటీ అడుగుతుంటే సమాధానం లేదు?"

"అబ్బబ్బ ఎవరో ఇళ్ళు అద్దెకిస్తారా అంటూ వచ్చారు. వాళ్ళతోమాట్లాడుతూ నీకెలా సమాధానం చెబ్తాను? అయినా అంత భయం దేనికి చెప్పు?" అన్నాను.

"ఎవడైనా గొంతు పిసికి పోతే..? నాకసలేవినిపించదు. పగలు,రాత్రి అన్న భేదం లేకుండా జాగ్రత్తగా వుండాలి తెల్సిందా? అసలే ఎవరూ లేరు ఇంట్లో . రోజులు బాగాలేవు. నువ్వు చిన్న పిల్లవి. నీకేం తెలీదు. ఎవరు పిలిస్తే వాళ్ళకి తలుపుతియ్యకు"

అమ్మమ్మ అనుకునేంత ఘోరంగా వున్నాయా రోజులు? నమ్మకూడదని ఎవర్నీ లోపలికి రానీయకుండా, ఎవరితో మాట్లాడకుండా వుండడం ఎలా సాధ్యం?

ఈ వచ్చినవ్యక్తి రాత్రి మనఇంటి ముందు నిలబడి వున్న అతనా? ఏమో? అయినా ఏవిటీ అందర్నీ ఇలా అనుమానించడం? ఛీ... నిన్న రాత్రి విషయం అమ్మమ్మకు చెబితేనో? ఇంకేమైనా వుందా?

కుర్చీ ఫాన్ కిందకు ఈడ్చుకుని మెల్లగా పుస్తకం తెరిచాను. ఇంకా నిన్నటి కథలోనే వున్నాను. అమ్మమ్మ పూజలో వుంది. ఇప్పుడిప్పుడే తెమిలే వ్యవహారం కాదు. ఈ పూజలవల్ల ఏమైనా ఫలితాలుంటాయా? వున్నా, లేకపోయినా మనసుకు ఆనందం కలిగించే విషయమైతే వాళ్ళను చేసుకోనివ్వాలి అని మావయ్య అంటూవుంటాడు. అవునూ, మావయ్యకి వుత్తరం రాయలేదు. పోస్టాఫీసుకి వెళ్ళాలనుకుంటున్నాను. మళ్ళీ అంతలోనే మరుపు వచ్చేస్తోంది. ఛత్..

ఒక్క ఉదుటున లేచి - బట్టలు మార్చుకుని.

"అమ్మమ్మా తలుపు దగ్గరకు వేసుకో. వంటైపోయింది.ఇంకో అరగంటలో పోస్టాఫీసు మూసేస్తారనుకుంటా. వెళ్ళి కవర్లు తీసుకొస్తాను. తలుపు జాగ్రత్త" అని పర్సు తీసుకుని బయటపడ్డాను.

ఎండ ఇంకా పెరగలేదు కానీ, అందులోని వేడి ఆ సమయానికి ఎక్కువే!

పోస్టాఫీసులో జనం ఎక్కువ మంది లేరు. కవర్లు, కార్డులుకొన్నాను. ఎప్పుడూ చిల్లర గొడవ. ఎలాగో సరిపెట్టి అన్నిటికీ సరిపడ స్టాంపులూ, అవీ కొని బయటకు వచ్చాను.ఇంకా ఏమైనా అమ్మమ్మ అడిగిందా తెమ్మనమని? లేదు వచ్చేముందు ఏం చెప్పిపట్టులేదు.

ఇంటి వైపు నెమ్మదిగా అడుగులు వెయ్యడం మొదలు పెట్టాను. చేతుల్లో చెమటకు కవర్లు తడి తడి అవుతున్నాయి.

అమ్మమ్మ గుమ్మంలో నిలబడి చూస్తోంది. నాకేదో అనుమానం వేసింది 'ఏమైంది? ఎందుకు బయటకు వచ్చావు!'

'అహ ఇప్పుడే సీతమ్మ వచ్చి వెళ్ళింది. తలుపు సరిగా వేసిందో లేదో చూద్దామని వస్తే, నువ్వు వస్తూ కనిపించావు. అద్సరే గానీ, సీతమ్మ వాళ్ళ ఇంట్లో నిన్న రాత్రి దొంగలు పడ్డారట. స్కూటర్ మీద వచ్చారట. దర్జాగా పెద్ద మనుషుల్లా కన్పించారట.

సీతమ్మ మొగుడు ఊళ్ళో లేడట. పిల్లలుఇంట్లో లేరట. తలుపు తీసేసరికి, జొరబడి దాని నోరు, చేతులు కట్టేసి ఇంట్లోని బంగారం, పట్టుచీరలు తీసుకుపోయారట. ఇప్పుడు ఇంటి నిండా పోలీసులు, పోలీసు కుక్కలు, వ్యవహారం - పిల్లల్ని భోజనానికి ఇక్కడకి పంపుతానంటే సరే దాన్దేముంది అన్నాను. అన్నం ఒకటి వండితే చాలు.కూరలు అవీ ఫర్వాలేదులే. నేనుచెప్తే వినవు కదా! నువ్వు వెళ్ళిన దగ్గర్నుంచి నాకొకటే బెంగ"

నాకు నోట మాట రానట్టయింది. బహుశ దొంగను ఆ సమయంలోనే నేను మేడ మీంచి చూసుంటాను. వాడు కనీ, కనిపించక వున్నాడు.

ఇదంతా నిజమేనా?

'అమ్మమ్మా ఇప్పుడే వస్తాను!' అంటూ పరుగులాంటి నడకతో రెండు వీధుల అవతల వున్న సీతమ్మ ఇంటికి బయలుదేరాను. ఆవిడ మా ఊరు ఆవిడే. దూరపు బంధుత్వం కూడా వున్నట్టుంది. కొద్దిపాటి సంపాదనతో కూడికగా లాక్కొస్తున్న సంసారం వాళ్ళది. ఆ దొంగాడికి వాళ్ళ ఇల్లే కన్పించిందా? వున్న ఒకటీ, అరా బంగారం వస్తువులు పోయుంటాయి పాపం!

నేను వెళ్ళేసరికి పోలీసులు ఒకసారి వచ్చి వివరాలు తీసుకున్నారట. రెండోసారి అప్పుడే వచ్చారట. ఎవర్నీ వుండనియ్యకుండా వెళ్ళిపొమ్మంటున్నారు. నేను లోపలే వున్నాను. నేను ఎవర్నో చూశాననిచెప్పనా? ఎందుకులే అని ఊరుకున్నాను.

కుక్కలు వాసనచూశాయి. వాతావరణం అంతా భయంగా వుంది. సీతమ్మ ధైర్యం కోల్పోవడానికి అవకాశం లేక ధైర్యంగా వుంది. పోలీసులు వచ్చి వెళ్ళిన మధ్యటైములో మా ఇంటికి వచ్చిందట. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వచ్చి సీతమ్మను అన్ని వివరాలు అడిగారు.

సీతమ్మ పిల్లలు పక్కింటి కుర్రాడితో సినిమాకు వెళ్ళడం వలన ఆ వేళప్పుడు ఇంట్లో లేక పోయారట. పిల్లలు వచ్చుంటారని తలుపు తీస్తే దొంగలు చొరబడి సీతమ్మను కట్టేసి అరగంటలో వెళ్ళిపోయారు. పిల్లలు వచ్చి, చుట్టు పక్కల వాళ్ళుచేరి, పోలీసులకు కబురందించి - ఇవన్నీ జరిగేటప్పటికి తెల్లవారినట్టుంది.

నేను చెప్పడం నయమనుకుని ధైర్యం చేసి చెప్పేశాను. నేను చెప్పినవి నోట్ చేసుకుంటూ, ఆ వేళప్పుడు అక్కడ ఏం చేస్తున్నాను లాంటివి అడిగారు. నేను ఇచ్చినవివరాలు పెద్దగా ఉపయోగ పడ్తాయో లేదో తెలీదు. కానీ చెప్పాల్సిన వన్నీ చెప్పాను. నిజానికి నాకే చాలా అయోమయంగా వుంది. అయినా అలాగే చెప్పాను.

కుక్కలకి వాసన చూపించి విషయం పరిశీలనలోకి తీసుకుని పోలీసులు వెళ్ళిపోయారు. సీతమ్మ భర్త వచ్చేంత వరకూ కొంత అండగా వున్నాను.

** ** **

దొంగల్లో ఒకడు దొరికాడట. కొంత నగా, నట్రా దొరికాయి. వాడివల్ల మిగిలిన వాళ్ళూ దొరుకుతారు. పోలీసులు, కోర్టు చుట్టూ సీతమ్మ, ఆమె భర్త తిరిగారు.

కోర్టులో దొంగ ముఖం చూడాలన్న కుతూహలంతో సీతమ్మతో వెళ్ళాను.



ఆ రోజుమేడ మీద నుంచి కూడా అతని ముఖం నాకు కన్పించలేదు. నేను కూర్చున్న చోటి నుంచి స్పష్టంగా కన్పడలేదు గానీ, కొంచెంసేపటి తర్వాత ఇటుగా తీసుకురాగా చూశాను. అతనిలో ఏ ప్రత్యేకతా, అసాధారణత కన్పించలేదు. అందరిలాంటి ముఖమే అదీను!

నేను ఎంతో క్రౌర్యం, చెడ్డతనం కోసం ఆశించాను. కానీ ఇతని ముఖం అందరి ముఖాల్లానే వుంది. విచిత్రం! ●